


ఎ.వి.రెడ్డిశాస్త్రి

# మళ్ళీ వచ్చే వసంతంకోసం

కథ

'నేనొక పిచిక పిల్లని చూసేను'

'ఎప్పుడు తాతయ్యా?'

'ఇవాళే'

'ఇవాళా? ఇవాళెప్పుడు చూసేవు? మేమంతా యిక్కడేకదా వున్నాఁవు?'

'అదా... మీరంతా బయటకెళ్లేరుకదా... అప్పుడు.'

'మేఁవంతా లేనప్పుడే ఎందుకు వచ్చింది తాతయ్యా?'

'కాసేపు కబుర్లు చెప్పి పోడానికి వచ్చిందట'

'మరి మేఁవంతా వున్నప్పుడు వస్తే... అందరం మాట్లాడేవాళ్లంకదా!'

'భయఁవా? ఎందుకని?'

'మీరందరూ ఎప్పుడూ బోలెడు పనిలో వుండి- నిమిషం విశ్రాంతి లేకుండా- ఏదో చేస్తూ ఉంటారట గదా- అందుకని మీరు దాని మాటలు వినరని భయపడింది.'

'ఛా ఉట్టిదే- మేవేం చేస్తూంటాం అంత తీరిక లేకుండా!'

'అదేవిటి తల్లీ అలా అంటావ్- నువ్వు, అన్న నిత్యం హోంవర్కు అని పుస్తకాలు ముందేసుక్కూర్చుంటారు. ఇంట్లో వున్నంతసేపు మీ పెద్దన్న ఎప్పుడూ జీఆర్ఈ అని గేట్ అనీ తన వ్యాపకంలో ఉంటాడు. మీ నాన్న ఎప్పుడూ కంప్యూటర్ ముందు కూర్చుని ఏవో అంకెలు, లెక్కలు వేస్తూ కూర్చుంటాడు. మీ అమ్మ బ్యూటి క్లినిక్కి వచ్చిపోయేవాళ్లతో సతమతమౌతూవుంటుంది. మరి మీకు తీరికెక్కడమ్మా... పిచిక పిల్లతో సరదాగా కబుర్లాడ్డానికి?'

'ఛా, ఎంత మంచి ఛాన్సు మిస్సయేనో యివాళ! సరేకాని తాతయ్యా... మరా పిచికపిల్ల నీదగ్గరకి ధైర్యంగా వచ్చేసిందా?'

'వచ్చేసిందమ్మ! నేను దాన్ని ఏమీ అనననని- దాంతో మాట్లాడతానని ఎలానుకుందో మరి.'

'ముందుగా ఎలా పలకరించింది తాతయ్య నిన్ను- హాయ్ అందా హలో అందా?'

'ఉహు- అలా ఏమి అనలేదు. వస్తూనే పలకరింపుగా తన చిన్న రెక్కల్ని కిందికీ మీదికి విదిలించి- నాముందు వయ్యారంగా నిలబడింది.'

'నవ్విందా పలకరింపుగా?'

'అంతకంటే ఎంతో గొప్పగా పలకరించింది.'

'అంటే ఎలా?'

'ఓ చిన్న గులాబి మొగ్గని తన ముక్కుతో కరచిపట్టుకుని వచ్చి నా ముందు వేసింది.

నా సంతోషాన్ని తెలియపర్చేందుకు ఈ చిన్న గులాబి మొగ్గని తెచ్చేను అంది. ఎంతో దూరం వెళ్ళి ఎన్ని దగ్గర్లో వెతికితేగాని ఈ గులాబి మొగ్గ కనిపించలేదు అంది. ఏ ఇంట్లో చూసినా రకరకాల గోలేలు కనిపిస్తున్నాయిగాని తీరా దగ్గరికి వెళ్లిచూస్తే అవన్నీ ప్లాస్టిక్ పువ్వులే- దరిద్రంగా అంది.

మరి ప్లాస్టిక్ పువ్వులు బాగుంటాయికదా! మనింట్లో ఫ్లవర్‌వాజులన్నిట్లోనూ రకరకాల రంగుల్లో ప్లాస్టిక్ పూలేకదా తాతయ్యా!'

'ప్లాస్టిక్ పువ్వులు, ప్లాస్టిక్ మొక్కలు ఏం బావుంటాయి చెప్పుతల్లీ! వాటికి వాసనలేవీ? కొత్తచిగుళ్లు, కొత్తరెమ్మలు వాటికెక్కడుంటాయమ్మా? నాల్రోజులు చూసేక ఐదోరోజున వాటిని చూడాలనిపిస్తుందా?'

'ఏఁవో బాబూ... మాకివే బాగున్నాయి'

'అది నీ తప్పుకాదమ్మా, చిన్నప్పట్నుండీ నిన్ను యంత్రంలా

తయారుచేస్తున్న ఈ సమాజంది'

'మరి నిజం మొక్కలు వేస్కోడానికి మనకి జాగా లేదు కదా తాతయ్యా!'

'అవునమ్మా అదీ నిజం వే! మనకి జాగాలేదుగా మామూలుగా బతకడానికి! దేశంలో జనాభా బాగా పెరిగిపోయి- యిలా అపార్టుమెంటుల్లో బతకవలసిన గతి దాపురించింది. ఇప్పుడు మనకీ, బోనులో వున్న ఎలకలకీ మధ్య పెద్ద తేడా ఏమీలేదు. ఒక మొక్క వేస్కోడానికి జాగాలేదు, ఒక పచ్చని చెట్టుని చూడడానికి మనకి అవకాశం లేదు. చెట్ల చేంవలూ లేకపోడంతో ఎక్కడా పక్షులు మసలడానికి కూడా వసతి లేకుండాపోయింది. ఆఖరికి చిన్న పిచికపిల్లని కూడా చూడడానికి వీల్లేని పరిసరాల్లో బతుకుతున్నాం. ఇదేం ప్రపంచం, యిదేం బతుకు చెప్పు'

వస్తుంది తల్లీ,
తప్పక వస్తుంది.
వసంతంరాగానే మళ్ళీ
వస్తుంది. వసంతం అంటే
ఏంవిటో నీకు తెలీదు కాని,
అది వచ్చిన్నాడు తప్పక
పోల్చుకుంటావు.

'అయితే తాతయ్యా- మనం బతుకుతున్న ప్రపంచం బాగులేదా?'

'నువ్వే చెప్పు- బాగుందేమో! ఎటుచూసినా రాక్షసుల్లా పైకి లేచిన సిమెంటు భవంతులు, నల్లగా, పరిగెడుతున్నట్లున్న పాముల్లా కనిపిస్తున్న రోడ్లు, అన్నీ దగ్గరదగ్గరగా సర్దుకొని కూర్చున్నట్టు కనిపించే వీధులు. ఎక్కడా ఏమాత్రం ఖాళీ అన్నది లేకుండా, మనం కిటికీలని తెరుచుకోడానికి కూడా వీల్లేదు కదా!'

'అదేంవిటి తాతయ్యా అలా అంటున్నావ్? కిటికీ తలుపులెందుకు తెరుచుకోడానికి వీల్లేదంటున్నావ్?'

'ఎలా తెరుస్తాం? తెరిస్తే పక్కవాటా వాళ్ళ బెడ్‌రూమ్ కిటికీ ఎదురుగా వుంటుందికదా! అంచేత మనం కిటికీ తెరవడం సభ్యతకాదు కదా! సభ్యత కోసం వాళ్ళు కిటికీ తెరవరు. మనంవూ తెరవవు, గాలీ వెలుతురూ ఏవీరావు ఇంట్లోకి. ఇంట్లో చూస్తే నిత్యం టీవీలు, టేపురికార్డర్లు, వాటి గోలే తప్ప ఓ మంచి సంగీతంగాని, ఓ పక్షుల పాటగాని, కనీసం ప్రాణానికి హాయనిపించే రవ్వంత గాలిగాని- ఇవేవేనా వున్నాయా మనకి?'

'తాతయ్యా నీమాటలు వింటుంటే మన బతుకు లేం బాగులేవనిపిస్తోంది. పోనీ, ఏంవిటేంవిటి వుంటే బాగుంటుందో చెప్పవా!'

'చెప్తానమ్మా, తప్పకుండా చెప్తాను. పక్షులు బాగుంటాయి, వాటి పాటలు బాగుంటాయి, చెట్లు బాగుంటాయి, తోటలు బాగుంటాయి, చెరువులు బాగుంటాయి, నదులు బాగుంటాయి, కొండలు బాగుంటాయి. విశాలంగా వుండే ప్రపంచం బాగుంటుంది.


ఏ అడ్డూ లేకుండా... ఆకాశాన్ని తనివితీరా చూడగలిగితే- అది ఎంతో బావుంటుంది'

'ఇన్ని బావున్న వస్తువుల పేర్లు చెప్పేవు... మరి అమ్మ నాన్న, పక్కింటి అంకులు, ఆంటీ, వీధిలోవున్న యింతమంది జనం... వీళ్లంతా యిన్ని మంచి వస్తువుల్ని వదిలేస్కొని... ఎందుకూ యిలా సర్దుకుంటూ బతుకున్నారు.?'

'అదే అర్థంకావడంలేదమ్మా! మనకున్న మంచిమంచివాటి నన్నిట్నీ వదిలేస్కొని కావాలని మనిషి ఈ నరకాన్ని ఎందుకు కావాలనుకుంటున్నాడో అర్థంకాకుండా వుంది.'

'పోనీ తాతయ్యా ఈ సంగతులు ఆపి, నీ మాటలు వింటుంటే ఎందుకో దిగులేస్తోంది. ఒక్కమారు నీ పిచికపిల్లని చూడాలని వుంది... మళ్లీ వస్తుందా?'

'వస్తుంది తల్లీ, తప్పక వస్తుంది. వసంతంరాగానే మళ్ళీ వస్తుంది. వసంతం అంటే ఏంవిటో నీకు తెలీదు కాని, అది వచ్చిన్నాడు తప్పక పోల్చుకుంటావు. అప్పుడు పిచికపిల్లలేం ఖర్మ- పావురాలు, మయూరాలు, మందారాలూ, మందాకినీలు అన్నీ వస్తాయమ్మా... పావురాలు, మయూరాలు, మందారాలూ, మందాకినీలు... అన్నీ వస్తాయమ్మా నీముందుకి'.




# సాహిత్యం - పెద్దల మాటలు

* కథ కేవలం కల్పనైతే దేవకన్యల కథ మాత్రమే అవుతుంది. వాస్తవికమైతే వార్తాపత్రికలోని వార్త అవుతుంది. రెండింటి సమ్మేళనమే ఉత్తమ కథా శిల్పం.

\- సంజీవ్ దేవ్

* ఒక కొత్త కథను చదవడమంటే ఒక కొత్త వ్యక్తిని పరిచయం చేసుకున్నట్టే.

\- కొడవటిగంటి కుటుంబరావు

* నవల అన్నది జీవిత రహస్యాలను విప్పి చెప్పేందుకు మంచి సాధనం.

\- ప్రేమ్‌చంద్

* మంచి నవల దాని కథానాయకుడిలోని నిజాన్ని ఆవిష్కరిస్తుంది. చెడ్డ నవల దాని రచయితలోని నిజాన్ని వెలికితీస్తుంది.

\- చెస్టర్‌టన్

* సాహిత్య మందిరంలో ఐశ్వర్యాన్ని ప్రేమించేవారికి స్థానం లేదు. సేవా జీవితాన్నే ప్రధానంగా భావించే భక్తులు హృదయబాధను అనుభవించేవాళ్ళు, ప్రేమను ప్రసాదించే శక్తి గల వాళ్ళే అక్కడ అవసరం.

\- ప్రేమ్‌చంద్

* ప్రపంచపు అద్భుత కవిత్వంలో తొంభై శాతం ముప్పయ్యేళ్ళ లోపు వయసు వారు రాసిందే. అందులోనూ సగభాగం పాతికేళ్ళ లోపు వాళ్ళు రాసిందే.

\- హెచ్.యల్.మెన్‌కెన్

* వచనం అంటే మాటలను అత్యంత మంచి క్రమంలో రాయటం. కవిత్వం అంటే అతి మంచి మాటలను అత్యంత మంచి క్రమంలో కూర్చడం.

\- కోలరిడ్జ్

* మరణానంతరం కూడా నువ్వు గుర్తుండాలంటే చదవదగిన పుస్తకాలు రాయి లేదా రాయదగిన పనులు చెయ్యి.

\- ఫ్రాంక్లిన్

* అందంగా అవధులను దాటి ఆశ్చర్యపరచ గలిగేదే కవిత్వం.

\- జాన్ కీట్స్

* అక్షరరూపం దాల్చిన ఒక సిరాచుక్క. లక్ష మెదళ్ళకు కదలిక.

\- కాళోజీ